తెలవారుతూంది. ఈ సత్యాన్ని బలపరుస్తున్నట్టు, ప్రాతః కాలానికి స్వాగతం పలుకుతున్నట్టు, పక్షులు కిలకిలారావాలు చేస్తున్నాయి. కొన్ని హుషారైన కోడిపుంజులు ఎంతో ముందుగానే కూసేసి, మాడ్యూటీ అయిపోయిందన్నట్టు మిన్నకున్నాయి. నాకివన్నీ మెలుకువ వుండీ, లేనట్లు, చూచాయగా గుర్తున్నాయి. రాత్రంతా నిద్రపోయినా, తెల్లవారు ఝామున చల్లచల్లగా, మెల్లమెల్లగా వీస్తున్న ఆ చిలిపి గాలిలో నిద్రపోవడంలో వుండే సుఖమూ, తృప్తీ వేరు. అందుకే అలా ఆరు బయట ఆ చల్లగాలిలో పడుకునేవున్నాను. అప్పటికే శ్రీమతి రెండుసార్లు వార్నింగ్ ఇచ్చి వెళ్ళింది. 'తెల్లవారింది లేవండి' అని. నేను బద్ధకంగా అలాగే ఇటూ అటూ పొర్లుతూనే వున్నాను. తుదకు ఆఖరి వార్నింగ్ జారీ కావడంతో ఇక తప్పదన్నట్టు మంచం మీద నుండి లేచాను.

'మ్యావ్'... మ్యావ్' మంటూ ఇంటిగుమ్మం దగ్గరే ఆ పిల్లి స్వాగతం పలికింది. 'ఛీ... ఛీ... పాడుపిల్లి, దీన్ని తప్పించుకోవాలనుకుంటే ఏ రోజూ కుదరదు కదా! ఉదయాన్నే ముందుగా దీని దర్శనమో లేక స్వరం వినడమో తప్పదులాగుంది' అనుకున్నాను.

ఎందుకో ఆ పిల్లిని చూస్తే నాకు ఒక రకమైన ఎలర్జీ. కోపం, అసహ్యం, భయం అన్నీ కలిసిన ఒక భావం. ఉదయాన్నే దాని ముఖం చూడడం వల్ల నాకు ఎప్పుడూ చెడు మాత్రం జరుగలేదనుకుంటాను. కానీ ఎందుకో నిద్రలేవగానే పిల్లిని చూడాలంటే చాలా మందివలె నాలోనూ అదోరకమైన అయిష్టం. నిజంగా చెప్పాలంటే, ఈ సెంటిమెంటుకన్నా నాకు ఆ పిల్లిపై నున్న శత్రుభావమే ప్రధానమైంది. ఎందుకంటే అది మా ఇంట్లో చేసే ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. మన కష్టాలు తోటివారితో చెపితే మనసుకు కొంత ఉపశమనమంటారు. ఆ దొంగపిల్లి, కొంచెం ఏమరుపాటుగా వుంటే చాలు పాలు, పెరుగు, నెయ్యి అన్నీ తాగి పోతుంది.

ఒక రోజు మా శ్రీమతి తలుపు వేయడం మరచిపోయి అలా వెళ్ళింది. అంతే! కొద్దిపాటి ఏమరుపాటు కోసం ఎదురు చూస్తున్న శత్రుసైనికునిలా దొంగపిల్లి పాలగిన్నె పైబడి చెండాడింది. గిన్నెల శబ్దం విని పరుగెత్తుకొని వచ్చేటప్పటికే ఆ పిల్లి తుర్రుమంది. నా కోపానికి హద్దులేదు. ఆ పిల్లిని ఎటూ శిక్షించలేను. కాబట్టి ఆ కోపం శ్రీమతి వైపు మళ్ళించాను. "నీకు ఈ మధ్య అజాగ్రత్త మరీ ఎక్కువౌతూంది. పక్కలో బల్లెంలా, పొంచివున్న శత్రువులా, ఆ పిల్లి ఎప్పుడూ సిద్ధంగా వుంటుందని తెలుసుగదా! ఆ తలుపు కాస్తవేసివెళితే, నీ సొమ్మేమి పోయింది?"

పాపం! శాంతి మాత్రం ఏం చేస్తుంది? పాలు నష్టమైనందుకు తనకు మాత్రం బాధ వుండదూ? నేను అలా కోప్పడి నా డ్యూటీ అయిపోయిందన్నట్టు, పిల్లి మీద ప్రతీకారం తీర్చుకున్నట్లు తృప్తి పడ్డాను. కాని పాపం శాంతికి సమస్య అంతటితో ఆగిపోదు. ఆ రోజుకు పాలు మళ్ళీ పురమాయించాలి. అది అంత సులువైన పనికాదు. ఈ రోజుల్లో డబ్బు వున్నా దొరకని వస్తువుల్లో పాలు అగ్రస్థానాన్ని ఆక్రమిస్తుందని అనడంలో అతిశయోక్తి లేదనుకుంటాను. పాలు ఎలా సంపాదించాలి? రోజుకు మూడు సార్లయినా కాఫీ అడిగే నన్నూ, పెరుగులేందే అన్నం ముట్టని పిల్లలను ఎలా సముదాయించాలి? అనే ఆలోచనలో వుండేమో, శాంతి నా చీవాట్లకు బదులు చెప్పలేదు. గొప్పలు చెప్పకోవడం కాదుగానీ, ఆమె స్వభావమే అంత. ఎప్పుడో గానీ కోపగించుకోదు. గట్టిగా మాట్లాడదు. నిబ్బరంగా, హుందాగా ఇంటి పని చేసుకుంటూ పోతుంది.

ఆ పిల్లిలో వైరం నేను వ్యక్తిగత ప్రతిష్టగా ఫీలవుతుంటాను. 'దానికి ఎంత గర్వం. ఎంత నిర్లక్ష్యం? ఎన్నిసార్లు తరిమినా మళ్ళీ నిమిషంలో ప్రత్యక్షమౌతుంది. ఛీ... ఛీ... ఎన్నిసార్లు కొట్టినా ఈ పిల్లికి సిగ్గులేదు' అనుకున్నాను. కానీ అంతలోనే ఎక్కడో నాలోని మనిషి అన్నాడు. 'పాపం ఆ పిల్లిదేముంది?



# మార్జాలోపాఖ్యానం

అల్పప్రాణి. సకల ప్రాణికోటిలోను సమున్నతుడైన 'మనిషి'కే సిగ్గులేదు. నిజంగా మనిషికి ఏ మాత్రం సిగ్గు, అవమానం, భయం, అనేవి వుంటే ప్రపంచంలో ఇన్ని మోసాలు, దొంగతనాలు, దోపిడీలు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు ఎలా జరుగుతాయి? ఎందుకు జరుగుతాయి? ఏదో విధంగా పనులు నెరవేర్చుకుంటూ, పబ్బం గడుపుకునేవాడే ఘనుడు. ఇలా సిగ్గు, సంకోచము, అని మడిగట్టుకు కూర్చుంటే ఈ లోకంలో మనుగడే కష్టతరమౌతుంది. కాబట్టే ఇవేవీ పట్టించు కోకుండా ఈ ప్రపంచం ముందుకు సాగుతూ వుంది. అటువంటప్పుడు పాపం! ఆ పిల్లికి సిగ్గూ, ఎగ్గూ లేవనుకోవడం వెర్రితనం కాదా?

అలా అనుకున్నప్పుడు భోజనాలు అయిన తరువాత ఆ పిల్లికి కాస్త పెరుగో, పాలో కలిపిన అన్నం వేయమని చెప్పేవాడిని. అది కేవలం పిల్లి మీద జాలిగాని,

లేక నా దాతృత్వంగాని కాదు. అలా వేస్తే అయినా, ఆ పిల్లి దొంగతనంగా ఇంట్లో ప్రవేశించి అన్నీపాడుచెయ్యదేమోననే ఆశ. కానీ శాంతి మాత్రం ఈ ఆలోచనలన్నిటికీ అతీతంగా, మానవతా దృష్టితో దానికి రోజూ రెండు పూటలా అన్నం పెడుతూ వుంటుంది. ఇన్ని చేసినా ఆ పిల్లికి మాత్రం దొంగబుద్ధి పోలేదు. అదే నా కోపం.

భోజనం చేసేటప్పుడు అది ఎదురుగా కూర్చొని మ్యావ్... మ్యావ్... మని అరుస్తూ వుంటే నాకు చెడ్డ చికాకుగా వుంటుంది. అది చాలా తెలివైంది. మనం భోజనం చేస్తూ సారిసారికి దాన్ని తరమడానికి లేవలేమని దానికి బాగా తెలుసు. దాని మొండితనం చూసి నాలోనూ మొండితనం పెరిగేది. 'దానికి అసలు తిండే వేయవద్దు. అది అలా అరచి అరచి చావనీ' అని శాంతితో అన్నాను. చెప్పిన మాట వినకుండా అల్లరి చిల్లరి పనులు చేసే కొడుకుకు బుద్ధి చెప్పడానికి, తండ్రి వేసే శిక్షలావుండేది నా ఆర్డరు. కానీ, ఆపిల్లి అలా మ్యావ్... మ్యావ్... మని అరుస్తూ వుంటే పాలకొరకు



— కొమ్మిశెట్టి మోహన్

గుక్క తిప్పకోకుండా ఏడుస్తూన్న పసిపాప ఏడుపుకు తల్లడిల్లిపోయే తల్లిలా ఫీలయ్యేది శాంతి. ఎంతైనా తల్లిగదా! ఎంత అల్లరి, చిల్లరి పనులు చేసినా కన్నకొడుక్కు తిండి పెట్టకుండా మాడ్చడం అన్యాయం, అమానుషం అన్నట్లు, దానికి గబగబా కొంత అన్నమూ, పెరుగూ కలిపివేసి వచ్చేది. పిల్లి అన్నం వేసిన ఆ కొద్ది క్షణాలు మాత్రం ప్రశాంతంగా వుండేది. మళ్ళీ ఆరక్షణంలో మ్యావ్... మ్యావ్... మంటూ ప్రత్యక్షమయ్యేది.

ఆ రోజు ఆదివారం సాయంకాలం. మధ్యహాలులో కూర్చొని టి.వి.లో తెలుగు సినిమా చూస్తున్నాము. పాత సినిమా అని వేరే చెప్పనక్కరలేదు. 'ఇంటికి దీపం ఇల్లాలు... ఆ దీపకాంతులే పిల్లలూ... పిల్లలూ' అనే పాట వస్తూంది. అందరం తన్మయత్వంతో చూస్తున్నాము. నేను కూడా ఆ పాటలోని సాహిత్యాన్నీ, భావాన్నీ మెచ్చుకుంటూ ఆనందిస్తున్నాను. నిజంగా పాత సినిమాలతో పోల్చితే నేటి సినిమాలు ఎంత దిగజారిపోయాయో అని పించింది. అప్పుడప్పుడు ఒకటీ, అరా మంచి సినిమాలు తళుక్కున మెరిసి మాయమవుతుంటాయి, తెలుగు సినిమా గౌరవాన్ని బ్రతికించడానికన్నట్లు.

ఇంతలోనే వంటగదిలో 'ఢన్'మని గిన్నెలు క్రిందపడిన శబ్దం. యుద్ధ విరామసమయంలో విశ్రాంతిగ, మానసికానందానికి గానాబజానాలో మునిగివున్న సైనికులు, వూహించకుండా తమ స్థావరాలపై శత్రువులు బాంబుదాడికి ఉలిక్కిపడి అలెర్ట్ అయినట్టు, ఇంటిల్లిపాదీ ఒక్కసారిగా లేచి వంట ఇంటి తలుపు తీసి చూశాము. ఇంకేముంది? పిల్లి నేతి టిఫిన్ క్యారియర్‌ను క్రిందికి దొర్లించింది. మూత రాలేదు కానీ, నెయ్యి మాత్రం కింద కారుతూ వుంది. ఎదురుగా పిల్లి మ్యావ్... మ్యావ్ మంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన దొంగలా అలాగేవుంది. తలుపుకు అడ్డంగా మేమంతా వున్నందున అయినా అది పెద్దగా గాబరా పడినట్లు లేదు. 'పట్టుకుంటే పట్టుకోండి, ఇలా పట్టుబడడం, మరలా తప్పించుకోవడం, నాకు మామూలేగా' అని అలవాటుబడ్డ పాతకేడీ, పోలీసులతో పలికే పలుకుల్లా వుంది ఆ పిల్లి అరుపు. శాంతి ఒక్కసారిగా తేరుకుని 'వంటగది తలుపు వేశాను. కిటికీ కూడా జాగ్రత్తగా వేశాను. అయినా ఈపాడు పిల్లి ఇంట్లోకెలా వచ్చింది?' ఆశ్చర్యంగా అంది. నా కోపానికి హద్దులేదు. అక్కడే చేతికందిన అప్పడాల కర్రతీసుకుని గురిచూసి విసిరాను. పిల్లి మ్యావ్... మ్యావ్... మంటూ మా మధ్యలో నుండి బయటకు జారుకుంది.

తలుపు, కిటికీ అన్నీ మూసివున్నా అద వంటగదిలోకి ఎలా వచ్చింది? అన్నది మాకు పెద్ద పజిల్‌గా తయారయింది. చాలా సేపు తర్జన భర్జన తరువాత అది కిటికీలు, తలుపులు వేయకముందే ఎక్కడో ఒక మూల దాక్కొని వుంటుందని తీర్మానించాము. ఇప్పుడు మళ్ళీ నా కోపం శాంతిపైకి మళ్ళింది. "ఆ జిత్తుల మారి పిల్లి సంగతి తెలుసుకదా! అది ఇక్కడే ఎక్కడైనా దాక్కుని వుంటుందనే కనీస జ్ఞానం వుండనక్కరలేదూ?" అన్నాను.

"అనండి. మీరు నన్ను కోప్పడడానికి మాత్రం ఒంటి కాలిమీద వస్తారు. అప్పటికి శ్రద్ధంతా మీకే వున్నట్టు, సంసారమంటే నాకే మాత్రం పట్టనట్టు. ఎంత జాగ్రత్తగా వున్నా పొరబాటు ఎవరికైనా జరుగుతుంటుంది" అసలు ఇంటిలో ఒక్క అలమారాకైనా తలుపులు వేయించారా? ఇంక పాలు, పెరుగు, నా కడుపులో పెట్టుకుని దాచుకోమంటారా? చెప్పండి? ఇంకేమైనా అంటే, "ఇంటికి ఇప్పటికే బోలెడంత డబ్బు ఖర్చు చేశాము. కొంత ఊపిరాడనీ. నిదానంగా అన్నీ పూర్తి చేస్తాము' అంటారు" శాంతి కండ్లనిండా నీరు నింపుకొని అంది.

ప్రతి సమస్యకూ ఒక పరిష్కారముంటుంది. ప్రతి మనిషికీ ఒక వీక్‌నెస్ వుంటుంది. మా శాంతి కూడా నా వీక్‌నెస్ పట్టేసింది. ఎప్పుడైనా తనకు పూర్తి కోపం, ఆవేశం వచ్చిందంటే నేను అంత ఇల్లు కట్టించినా, ఇంకా ఎన్నో అసౌకర్యాలున్నాయని ఎత్తి పొడుస్తుంది. శాంతి చెప్పిన దాంట్లో కూడా నిజం లేకపోలేదు. అందుకే ఎంత కోపంగా వున్నా ఆమె ఆలిగేషన్ వింటూనే మరి నేనేమీ మాట్లాడలేక పోయాను. ఛ... ఛ... నాకు కూడా అనాలోచితంగా కోపం ఎక్కువౌతూంది; ఇందులో ఆమెది మాత్రం తప్పేముంది? వున్న మాటే అంది. కొద్దిసేపటి క్రితం వరకూ సినిమా చూస్తూ వుండిన అనుభూతి చెదరిపోయింది. మళ్ళీ సినిమాలో ఇమ్మర్స్ కావడానికి కొంత టైము పట్టింది.

నాకు చాలా ఆశ్చర్యంగాను, విచిత్రంగానూ వుంది. ఒకరోజు పూర్తిగా గడిచింది. అంటే ఇరవైనాలుగు గంటలు. నిన్న అప్పడాల కర్రతో విసిరికొట్టినప్పటినుంచి పిల్లి జాడ లేదు. పూర్తిగా ఒక్కరోజు, ఇన్ని గంటలు, కొన్ని వందల నిమిషాలు, ఆ పిల్లి ఇంటివైపు కన్నెత్తి చూడలేదంటే మరి, అది అంత సాధారణం విషయం కాదు. నిజంగా నాకు చాలా సంతోషంగా వుంది. బహుశా నిన్న కొట్టిన దెబ్బకు దాని దిమ్మ తిరిగిపోయి వుంటుంది.

బాగా బుద్ధి వచ్చి వుంటుంది. ఇక ఈ జన్మలో మళ్ళీ అది ఇంటి గడప తొక్కదు అనుకున్నాను. అలా అనుకోగానే నాలో విజయగర్వంతో కూడిన ఆనందానుభూతి కలిగింది. ఎవరెస్ట్ నధిరోహించినపుడు టెన్‌సింగ్, వరల్డ్ కప్ గెలుచుకున్నప్పుడు, లేక ప్రపంచంలోనే అత్యధిక వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించినపుడు కపిల్‌దేవ్ కూడా అంత సంతోషాన్నీ, అనుభూతినీ పొంది వుండరేమో? వాటితో పోల్చినపుడు ఇది అంత గొప్ప విషయం కాదు. అంతగా ఇదైపోవడానికి కానీ నిజానికి మనిషి ఎంత అత్యాశాపరుడో, ఒక్కొక్కప్పుడు అంత అల్ప సంతోషి కూడా. ఎంత తెలివైనవాడో, అంత అమాయకుడు కూడా. అప్పుడునా పరిస్థితీ అదేనేమో! ఎవరో కొద్దిమంది తప్ప, ఎక్కువ మంది సంతోషాన్నయినా, బాధలనైనా తమలోనే దాచుకోలేరు. అవి తోటివారితో పంచుకుంటేనే వారికి తృప్తి, ఆనందము. ఉపశమనమూనూ. బహుశ నేను కూడా ఆ కోవలోకి చెందినవాడినే అయివుంటాను. “పిల్లి ఇరవైనాలుగు గంటల నుండి మన ఇంటివైపుకు రాలేదు. ఏ ఉపద్రవమూ సృష్టించలేదు. మనకెంతో ప్రశాంతంగా వుంది కదూ!" శాంతితో అన్నాను. ఆమె కూడా నా ఆనందంలో పాలు పంచుకుంటుందనుకున్నాను. కానీ ఆమె నా అంత ఇదిగా స్పందించలేదు. చిన్నగా నవ్వి వూరుకుంది. నేనెంతో చిన్న బుచ్చుకున్నాను. ఇంక ఆ విషయాన్ని ఆమెతో పొడిగించలేదు. తోకముడిచిన పిల్లిలా, నిరుత్సాహంగా వచ్చి స్టడీ రూములో కూర్చున్నాను.

తరువాత రోజు కూడా పిల్లి జాడలేదు. పూర్తిగా దాని పీడ విరగడై పోయిందనుకున్నాను మనసులో. ఆ మరుసటి రోజు ఉదయాన్నే కాఫీ తాగి, నేను స్టడీ రూమ్‌లోకి ఏదో పుస్తకం కోసం వచ్చాను. ఇంతలోనే మ్యావ్... మ్యావ్... మన్న శబ్దం. ఇది కలకాదు నిజమే. చిరపరిచితమైన శబ్దమది. సందేహంలేదు. ఆ పిల్లి శబ్దమే అది. ఎక్కడో దూరంగా కాదు. దగ్గర్లోనే వినిపించింది. తక్కువ క్రిందికి వంగి చూశాను. నాలుగు అరలుగా వున్న పుస్తకాల అలమరాలో క్రింది అరలో అదే పిల్లి, నక్కి కూర్చుని వుంది. దానితోపాటు మరి నాలుగు పిల్లి కూనలు. నా వళ్ళు ఒక్కసారిగా జలదరించింది. 'శాంతీ!' గట్టిగా కేకవేశాను. వంట ఇంటిలో ఏదో పనిలో నున్న శాంతి పరుగెత్తుకుంటూ వచ్చింది. 'ఏమిటండీ?' అంటూ. నేనేమీ మాట్లాడకుండా పిల్లీ, దానిపటాలం వైపు వేలెత్తి చూపించాను.

“హమ్మయ్య! ఇంకా ఏదోనని హడలి పోయానంటే నమ్మండి. పిల్లేగదా! పాపం పిల్లల తల్లి. దాని జోలికి పోకండి. రాత్రి ఎప్పుడో దాని పిల్లల్తోసహా కిటికీ లోంచి వచ్చి ఇక్కడ దాక్కునివుంటుంది. చిన్న పిల్లలున్నాయి. దాన్ని ఏమైనా అంటేపాపం. మీరు రెండు, మూడు రోజులు శాంతంగా వుండండి. అదే మళ్ళీ పిల్లలను తీసుకుని వెళ్ళి పోతుంది" శాంతి ఎంతో శాంతంగా అంది.

ఇంతలోనే పిల్లి 'మ్యావ్... మ్యావ్" అని అరిచింది. నన్ను రెచ్చగొడుతున్నట్టుగా 'నాకు కూడా ఈ ఇంటిలో సపోర్ట్ వుంది. హక్కు వుంది. నీ స్వంత ఇంటిలో నేనూ పలుకుబడి పెంచుకున్నాను. ఇంక నన్ను నీవేమీ చేయలేవు' అని వెక్కిరించినట్లుగా వుంది దాని అరుపు. ప్రత్యర్థి బలంగా వున్నప్పుడు తోక ముడిచి, ఇది మన కాలం కాదని సమయం కోసం వేచి వుండి, ఎత్తుకు పైఎత్తు వేసి, బలం పుంజుకొని బలగంతో దాడిచేసే ప్రత్యర్థిని చిత్తుచేసే వైరిలోని నేర్పరితనం, గడుసుతనం కనిపించాయా పిల్లిలో.

ఇంతలో మళ్ళీ మ్యావ్... మ్యావ్... నీ ఛాలెంజిని ఎదుర్కోలేనన్నట్లుగా నేనా గదిలోనుండి వడివడిగా మధ్య హాలులోకి వచ్చేశాను.




DIWALI GREETINGS

**SHA AMICHAND TARACHAND & CO.**

NANDIPATI VARI STREET VIJAYAWADA-1

PHONE : 423456 RES : 423739, 421482

WHOLE SALER :

Bilt Ballarpur Industries Limited

( PAPER DIVISION )

UNIT: BALLARPUR, SHREE GOPAL, CHOUDWAR SEWA

SISTER CONCERNS:

AMICHAND PAPER CO

LALIT ENTERPRISES

Amir LE

VISITING CARDS

LALIT ENTERPRISES, VJA

BEST QUALITY * SNOW WHITE

Mfg.: “AMIR” Visiting Cards,

Envelops & Wedding Cards & Files.